క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆఫ్తాల్మిక్

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు శుక్రవారం చేశారు. వియ్యంపేట ఆరోగ్య కేంద్రం ఆఫ్తాల్మిక్ ఈశ్వరరావు 135 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఆరుగురికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కంటి రోగాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం బీపీప రాజు, ఏఎన్ఎం స్వప్నకుమారి, ఆరోగ్య భద్రత ఇన్‌చార్జి గౌరి, ఎం.శ్రీనివాసరావు తదితరులు తమ సేవలు అందించారు.

పాఠశాల తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ గంగరాజు

జామి: మండలంలోని అట్టాడ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 గంగరాజు శుక్రవారం సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు శాతాన్ని, వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



సోంపురంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వేపాడ: గ్రామాల్లో బాల్య వివాహాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి అన్నారు. సోంపురంలో శుక్రవారం నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనుమతుల్లేకుండా మద్యం విక్రయించటం, సారా తయారు చేసిన చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యమత్యంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగరాజు, అరిగిపాలెం ఎంపీటీసీ టి.వి.రమణ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రారంభమైన స్కూల్ గేమ్స్



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు గేమ్స్‌ను శుక్రవారం జడ్పీటీసీ ఎస్.అప్పారావు, మాజీ సర్పంచ్ గుమ్మడి భారతి, మిరపాక రమణ తదితరులు ప్రారంభించారు. మండల స్థాయి స్కూలు గేమ్స్‌లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబాడీ, ఖోఖో, వాలీబాల్, చెస్ తదితర పోటీలు పీడీ గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చురుగ్గా జంగిల్ క్లియరెన్స్ పనులు



జంగిల్ క్లియరెన్స్ పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మండలంలోని అలజంగి నుంచి మెట్టపల్లి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. రహదారికిరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదాలకు కారణం అవుతుండడం.. అధికారుల పట్టించుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తమ సొంత నిధులతో జేసీబీ యంత్రాలను పెట్టి తుప్పలు, డొంకలు తొలగింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలజంగి, మెట్టపల్లి గ్రామాలకు చెందిన తమ పార్టీ నాయకులు ఇచ్చిన సమాచారంతో ఈ మేరకు పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రఘుమండ త్రినాథ్, చందక గురునాయుడు, రేవల్ల సత్తిబాబు, ప్రభాత్, చింతాడ లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి’ హామీలు... ఉత్తుత్తివేనా..!

- ఆర్ఈసీఎస్ పునరుద్ధరణ ఎప్పుడు!
- ఆంధ్రా ఫెర్రో పరిశ్రమ తెరిపిస్తామన్నారు..
- వంద రోజులు గడుస్తున్నా హామీల ఊసే లేదు

చీపురుపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బాటలోనే ప్రస్తుత ఎమ్మెల్యేలు నడుస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాంటి హామీలైనా ఇచ్చేయొచ్చు.. ప్రజలు ఏది అడిగినా మాటే కదా చెప్పేయొచ్చు.. అనుకున్నారేమోగానీ ఎన్నికల ముందు ఇష్టారాజ్యంగా హామీలు ఇచ్చేశారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చి ఇంతవరకు వాటి ఊసెత్తడం లేదు. అదే బాటలో నియోజకవర్గంలో ప్రజలకు ఆ రోజు హామీలు ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత వాటి కోసం కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రం నుంచి కేంద్రం వరకు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు సరికదా కనీసం హామీలు ఆచరణ కోసం ప్రతిపాదనలు కూడా పంపడం లేదు. అందులో భాగంగానే చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే, ఎన్నికల ముందు టీడీపీ కూటమి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు పలు హామీలిచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీల అమలకు ఎలాంటి కార్యాచరణ రూపొందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఈసీఎస్ పునరుద్ధరణ ఎప్పుడో..

ఏపీఈపీడీసీఎల్‌లో విలీనమై కార్యకలాపాలు సాగిస్తున్న గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్ఈసీఎస్)ను తిరిగి ఆర్ఈసీఎస్‌గా కొనసాగిస్తామని దాని కోసం ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే కళా వెంకటరావు హామీ ఇచ్చారు. అంతేకాకుండా 2024 మే 9న ఎన్నికల ప్రచారంలో భాగంగా చీపురుపల్లి వచ్చిన ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడుతో కూడా బహిరంగ సభలో ఇదే విషయాన్ని చెప్పించారు. సాక్షాత్తూ సీఎంగా ఉన్న చంద్రబాబుతోనే ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని చెప్పించినప్పటికీ ఇంతవరకు ఆ ఊసెత్తడం లేదు.



చీపురుపల్లిలో ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం

హామీలు అమలు చేయరా..

శృంగవరపుకోట: ఎన్నికల సమయంలో ఎన్నెన్నో హామీలిచ్చిన తెలుగుదేశం నేతలు నేడు అభివృద్ధి కోసం ఆలోచన చేయని తీరు విస్మయం కల్గిస్తోంది. విశాఖ – అరుకు రోడ్డును జాతీయ రహదారి చేస్తామని చెప్పుకుంటున్న దేశం నేతలకు రోడ్డులో ఉన్న గోతులు కానరావడం లేదు. ఎస్.కోటలో ఐటీ టవర్ మాట దేముడెరుగు పట్టణం నడిబొడ్డున ఉన్న గాంధీ పార్కు బహిర్భూమిగా మారక ముందే పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వేపాడ మండలానికి ఉన్న ఏకైక ప్రధాన రహదారికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, ఉన్న కొద్దిపాటి పనులు చేయించలేదు. జామి, కొత్తవలస రైతు బజార్లు, జామి, కొత్తవలసల్లో ప్రభుత్వ కళాశాలల ఏర్పాటుపై గతంలో పదేళ్ల కాలం పాటూ అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తావించిన దేశం ఎమ్మెల్యేగాని, నాయకులుగాని స్పందించకపోవటం విడ్డూరం. పుణ్యగిరిని పర్యాటక క్షేత్రంగా మార్చేస్తామంటూ మరోమారు ఎన్నికల వేళ ఊదరగొట్టినా ప్రస్తుతం దాని ఊసు లేదు. ఎస్.కోట పంచాయతీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఆలోచన చేయలేదు. ఎస్.కోట పట్టణంలో కన్నెంగెడ్డ, కుశ్లకోనేరుల కుళ్లు వదిలించేస్తామని చెప్పి, నాడు ఫోటోలు దిగి తర్వాత వాటి ఊసెత్తడం లేదు.

నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలోని చినబంటుపల్లి వద్ద ఉన్న ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ దాదాపు పదేళ్లుగా మూతపడి ఉంది. దీంతో పరిశ్రమ ఆధారంగా దాదాపు రెండు వేల మంది వరకు ఉపాధి కోల్పోయారు. దీంతో ఎన్నికల ముందు ప్రచార కార్యక్రమంలో భాగంగా

ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ సంగతి ఏంటి?

ఆ మండలానికి వెళ్లిన కళా వెంకటరావు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంధ్రా ఫెర్రో పరిశ్రమను తెరిపించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నప్పటికీ కనీసం పరిశ్రమ తెరిపించేందుకు యాజమాన్యంతో చర్చలు కూడా జరిపిన పాపాన పోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎన్నికల ముందు ప్రచారంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజలను నేడు మోసం చేస్తున్నారు.

మెరకముడిదాం మండలంలోని చినబంటుపల్లి వద్ద ఉన్న ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ



సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన

వేపాడ: గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ ఆధ్వర్యంలో జాకేరులో శుక్రవారం గ్రామ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెరువు గట్టుపై మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించిన నోడల్ అధికారి పాఠశాల విద్యార్థులచే పాఠ్య పుస్తకాలు చదివించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. గ్రామంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించనున్నట్టు నోడల్ అధికారి తెలిపారు. తహసీల్దార్ సన్యాసినాయుడు, విద్యుత్ శాఖ సూరిబాబు, వ్యవసాయ శాఖ ఏఓ యశ్వంతరావు, ఉపాధి ఏపీఓ ఆదిలక్ష్మి, పలు శాఖల అధికారులు, సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న అధికారులు

రహదారి కోసం గిరిజనుల ఆందోళన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

గంట్యాడ: తమ గ్రామానికి రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గిరిజనులు నిరసన చేపట్టారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన డి.కె.పర్తి గ్రామానికి చెందిన గిరిజనులు ప్లకార్డులు పట్టుకుని తమ గ్రామానికి తారు రోడ్డు వేయాలని శుక్రవారం నిరసన చేపట్టారు. రోడ్డు లేక అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి తీసుకుని వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. మృతదేహాలను గ్రామానికి తేవడానికి కూడ డోలీపై మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిరిజన కష్టాలను తెలుసుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో సన్యాసిరావు, శ్రీను, లక్ష్మితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల బీమాపై నిలదీత



సోమలింగాపురం గ్రామసంధర్శన కార్యక్రమంలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతు

మెరకముడిదాం: రైతులు సాగు చేస్తున్న పంటలకు బీమా వుందా...లేదా.. అన్న దానిపై వివరాలు తెలియజేయాలని ప్రజాప్రతినిధులు, రైతులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని సోమలింపురం గ్రామంలో ఎంపీడీఓ ఎం.రత్నం ఆధ్వర్యంలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, అరటి, చెరకు, అపరాలు తదితర పంటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందా.. లేదా...ఒకవేళ కల్పిస్తే ఎంతమొత్తం ప్రభుత్వం చెల్లిస్తుంది, ఎంత మొత్తం రైతులు చెల్లించాలో వివరించాలని స్థానిక ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, రైతు ఎస్.కృష్ణమూర్తిరాజు వ్యవసాయ శాఖ అధికారి శ్రావణితేజను నిలదీశారు. ఇంతవరకూ రైతులకు సరిపడ ఎరువులను పంపిణీ చేయలేదని, దీనివలస రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించి అధిక మొత్తం చెల్లించి ఎరువులు తెచ్చుకోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. దీనికి వ్యవసాయ శాఖాధికారిణి శ్రావణితేజ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ ద్వారా తోటగట్లు వేయడానికి అవకాశం ఉండికూడా సోమలింగాపురం పంచాయతీలో ఎందుకు పనులు పెట్టించలేదని ప్రశ్నించారు. ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ మాట్లాడుతూ తోటగట్లు పనులకు వేతనదారులు ముందుకు రావడం లేదని చెప్పడంతో, అక్కడే వున్న రైతులు మీరు తప్పనిసరిగా తోటగట్లు పనులు చేయాలని ఆదేశిస్తే ఎందుకు వేతనదారులు రారు..తప్పనిసరిగా వస్తారని చెప్పడంతో అవాక్కయ్యారు. సర్పంచ్ ఆబోతుల అప్పారావు, తహసీల్దారు అజురఫీజాన్, ఈఓపీఆర్డీ పుష్పారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

వేపాడ: గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జి.రామకృష్ణ జాకేరు పాఠశాలకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు అందజేశారు. పాఠశాల ఆవరణలో వేసేందుకు మామిడి, పనస, నేరేడు తదితర మొక్కలను పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు నాటిన మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కాలుష్యం నివారించేందుకు మొక్కలు విరివిగా పెంచాలన్నారు.

గజపతినగరంలో ట్రాఫిక్ ఇక్కట్లు

గజపతినగరం: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం నాలుగు రోడ్ల కూడలి మెంటాడ జంక్షన్ వద్ద నిత్యం ప్రైవేటు బస్సులు, కూరగాయల వ్యాపారస్తులు వల్ల ట్రాఫిక్ నిలిచిపోతుందని జైభీమ్ పార్టీ నాయకుడు పెంట శంకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రాఫిక్ కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల వ్యాపారస్తులకు రైతు బజారు వేరే చోట ఏర్పాటు చేసి అమ్మకాలు చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేయాలని శంకరరావుతో పాటు పలువురు కోరారు.

తూతూమంత్రంగా ‘ఇది మంచి ప్రభుత్వం’



కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం తొలి రోజు శుక్రవారం తూతూమంత్రంగా ప్రారంభమయ్యింది. వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్దేశించిన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రధాన అజెండాను వివరించారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్లు అరకొరగా రావడంతో పంచాయతీకి యాభై చొప్పున కార్యదర్శులకు అందజేశారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల తరువాత కార్యదర్శులు గ్రామాలకు వెళ్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఏమీ లేకపోవడంతో ప్రజలు నుంచి పెద్దగా స్పందన లభించలేదు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి : జేసీ

గంట్యాడ: గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేయాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమం జిల్లాలో అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామాల్లో చెత్త, చెదారం లేకుండా చూడాలన్నారు. ఇందు కోసం ప్రతి గ్రామంలోను శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ–క్రాప్, ఈకేవైసీ లను శతశాతం పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటారు. మండల ప్రత్యేకాధికారి అరుణశ్రీ, ఎంపీడీఓ వై. భవాని, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఎంపీటీసీ పొటుపు రెడ్డి భవాని, ఈఓపీఆర్డీ భానోజీరావు, పంచాయతీ కార్యదర్శి ఎల్.తవుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

పర్యావరణ ప్రేమికుడికి అభినందనలు

చీపురుపల్లి: పర్యావరణ పరిరక్షణపై నేపాల్ వరకు ప్రచార యాత్రను చేపడుతున్న కొట్టేడ హరికృష్ణను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అభినందించారు. గరివిడి మండలంలోని కె.పాలవలస గ్రామానికి చెందిన హరికృష్ణ చెట్లను కాపాడండి, నీటిని కాపాడండి, భూమి తల్లిని పరిరక్షించండి అంటూ చీపురుపల్లి నుంచి నేపాల్‌కు సైకిల్‌పై అవగాహన యాత్రను శుక్రవారం ప్రారంభించాడు. దీంతో ఆయన్ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. అవగాహన యాత్రలో ఎలాంటి అవసరం ఉన్నా తమకు తెలియజేయాలని ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. కార్యక్రమంలో చందక గురునాయుడు, రేవల్ల సత్తిబాబు, ప్రభాత్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



నేపాల్ యాత్ర చేపట్టిన హరికృష్ణను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాష్ట్ర పోటీలకు వల్లాపురం విద్యార్థులు



గుర్ల : త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

గుర్ల: మండలంలోని వల్లాపురం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ ఎం.రుపతిరావు శుక్రవారం తెలిపారు. నెల్లిమర్లలో జరిగిన త్రోబాల్ ఎంపిక జట్లలో బాలికల విభాగంలో పి.షమీల, బాలురు విభాగంలో ఎం.తేజ తమ ప్రతిభ చూపారని పేర్కొన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. వీరిని హెచ్ఎం వి.అప్పారావు తదితరులు అభినందించారు.



చీపురుపల్లి: క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు

చీపురుపల్లి నుంచి..

చీపురుపల్లి: రాష్ట్ర స్థాయిలో జరగనున్న త్రోబాల్ పోటీలకు పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలకు చెందిన చందక దుర్గారావు, బొడ్డు దిలీప్ ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ ఎడిఎస్ఎస్‌వి.ప్రసాద్ అభినందించారు. అధ్యాపకులు మూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం

చీపురుపల్లి: ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 4595 కేజీల పీడీఎస్ బియ్యాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం బహిరంగ వేలం వేయనున్నట్టు సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ భవనం, పాఠశాల భవనం కావాలని, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని గ్రామస్తులు కోరారు. వీటిపై స్పందించిన మంత్రి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రెడ్డి పావని, సరిధి దుర్గాప్రసాద్, మర్రాపు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో...

శృంగవరపుకోట: వంద రోజుల్లోనే పాలనను గాడిలో పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుది అని విశాఖ ఎంపీ భరత్ అన్నారు. పుణ్యగిరి గ్రామంలో ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి, మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



కెంగువ గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థుల ర్యాలీ

దత్తిరాజేరు: గజపతినగరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మాదకద్రవ్యాల నియంత్రణ, వాటి వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌ను అడ్డుకుందాం.. భవిష్యత్‌ను కాపాడుకుందాం.. అంటూ... నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సోమేష్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు విజయనగరంలోని గురజాడ కళాక్షేత్రంలో భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్తు పదార్థాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. రోషన్, అంజలికుమారి, జయ, వినోద్, లక్ష్మి, స్వాతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం నాలుగు రోడ్లు కూడలి వద్ద ర్యాలీలో విద్యార్థులు